

వైద్యులపై దాడులు హేయమైన చర్య

ఇటీవల కాలంలో వైద్యులపై దాడులు అధికంగా జరుగుతున్నాయి. ఇది చాలా హేయమైన చర్య. ఎన్నో కష్టాలకు ఓర్చి వైద్య వృత్తిలోకి వచ్చాం. ఆసుపత్రిలో నిత్యం మాకు పరీక్షే. డాక్టర్లకు భద్రత కల్పించడంలో పూర్తిగా విఫలమవుతున్నారు. ఒక కోల్‌కతా ఘటనే కాదు నిత్యం ఎన్నో సంఘటనలు జరుగుతున్నాయి. ఇవి పునరావృతం కాకుండా చూడాలి. ప్రభుత్వాలు కఠిన చట్టాలు అమలుచేయాలి.

– డాక్టర్ సలాది సాయికుమార్, ఎండీ, సూర్యచంద్ర హోమియో



ప్రత్యేక చట్టం అవసరం

మహిళా వైద్యులు, సిబ్బంది రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలి. కోల్‌కతా ఘటనను దృష్టిలో ఉంచుకుని అలాంటివి పునరావృతం కాకుండా ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంది. చట్టాల్లో మార్పులతోనే నేరాలు అదుపులోకి వస్తాయి. రోగుల ప్రాణాలు కాపాడేవారికి అండగా ఉన్నామని ప్రభుత్వం భరోసా కల్పించాలి. నిందితులను కఠినంగా శిక్షిస్తేనే ఘటనలు పునరావృతం కాకుండా ఉంటాయి.

– డాక్టర్ చందన పర్వతవర్ధిని, గైనకాలజిస్ట్, రాజమహేంద్రవరం



దీక్షారంభ్‌తో దిశానిర్దేశం

- 172 ఏళ్ల చరిత్ర ఉన్న ఆర్ట్స్ కళాశాలలో సకల వసతులు
- కొత్తగా ప్రవేశం పొందిన విద్యార్థులకు అవగాహన

కంబాలచెరువు: ఇంటర్ నుంచి డిగ్రీలో అడుగు పెట్టారు. కొత్తగా కళాశాలలో చేరారు. అంతా గందరగోళంగా ఉంటుంది. విద్యార్థులంతా కళాశాలకు వస్తున్నారు. తరగతులు వింటున్నారు. అయితే మినీ యూనివర్సిటీగా రూపాంతరం చెందిన ఆర్ట్స్ కళాశాల, అందులో ఉన్న వసతులు, లభించే విద్య వంటి ఎన్నో విషయాలపై ఇంటర్ పూర్తి చేసుకుని డిగ్రీలోకి వచ్చిన కొత్త విద్యార్థులకు పూర్తి అవగాహన ఉండదు. అలాగే కళాశాలకు వచ్చిన వారిలో చాలామందికి తెలీని భయం, బెరుకుతనం ఉంటాయి. వీటన్నింటినీ పోగొట్టి, అన్నింటిపై అవగాహన కల్పించే ప్రయత్నమే దీక్షారంభ్. కళాశాలలోని అన్ని గ్రూపుల విద్యార్థులకు సంబంధిత అధ్యాపకులు, సమన్వయకర్తలు, విభాగాధిపతుల ఆధ్వర్యంలో దీక్షారంభ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. కళాశాల ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్‌తో పాటు అన్ని విభాగాల వారు దీక్షారంభ్‌లో విద్యార్థులకు పూర్తి అవగాహన కల్పిస్తారు.

లక్ష్య సాధన వైపు నడిపించేలా

రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాలకు 172 సంవత్సరాల ఘన చరిత్ర ఉంది. ఈ విద్యాలయంలో ఎందరో దేశనాయకులు విద్యాబోధన, విద్యాభ్యాసం చేశారు. అలాగే కళాశాలలో మొత్తం 24 విభాగాలున్నాయి. వాటిలో ఒక రసాయనశాస్త్ర విభాగంలోనే ఆరు పెద్ద ప్రయోగశాలలున్నాయి. అంతేకాక అతిపెద్ద పరిశోధనా ప్రయోగశాల కూడా ఉంది. 33 మంది అధ్యాపకులు, 16 మంది డాక్టరేట్స్‌తో దేశంలోనే అతిపెద్ద కెమిస్ట్రీ ల్యాబ్ సైతం ఉంది. కంప్యూటర్ ల్యాబ్, లక్షన్నర పుస్తకాలతో అతిపెద్ద గ్రంథాలయం, జిమ్, అనేక వసతులతో మెట్‌కాఫ్ హాస్టల్ వంటివెన్నో ఉన్నాయి. వీటన్నింటినీ విద్యార్థులకు దీక్షారంభ్ ద్వారా తెలియజేస్తున్నారు. కళాశాలలో చేరిన తర్వాత మొదటి పది రోజులు నేరుగా పాఠాలు చెప్పకుండా, కళాశాలపై అవగాహన కల్పిస్తున్నారు. కళాశాలలో అన్ని విభాగాలకు విద్యార్థులను తిప్పుతూ చూపిస్తున్నారు. విద్యార్థులు కీలకమైన విధివిధానాలను వివరించడంతో పాటు ఇతర విద్యార్థులు, అధ్యాపకులతో సంబంధ బాంధవ్యాలు మెరుగుపరిచేందుకు ప్రయత్నిస్తున్నారు. కళాశాలలో ఉన్న వనరులను విద్యార్థులు తమ నైపుణ్యాలు పెంచుకోవడానికి ఎలా ఉపయోగించుకోవాలో సైతం శిక్షణ ఇస్తున్నారు. అంతేకాక బయటి నుంచి వివిధ రంగాలకు చెందిన ప్రముఖులను రప్పించి డిగ్రీలో నాలుగేళ్ల పాటు ఎలా చదవాలి, ఏ విధంగా లక్ష్యం ఏర్పరచుకోవాలి అనే విషయాలపై అవగాహన కల్పిస్తూ దిశానిర్దేశం చేస్తున్నారు.



దీక్షారంభ్ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర(ఫైల్)

> **విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం నింపడానికే**
>
> కళాశాలలో కొత్తగా అడుగుపెట్టిన విద్యార్థుల్లో భయాందోళన పోగొట్టి, కళాశాలపై పూర్తి అవగాహన కల్పించడమే దీక్షారంభ్ లక్ష్యం. కళాశాలలో అందుతున్న వసతులు, సౌకర్యాలు విద్యార్థులకు తెలిస్తే వారు వాటన్నింటినీ చక్కగా వినియోగించుకుని విద్యలో మరింత రాణించవచ్చు. ఈ కార్యక్రమం ప్రతి డిపార్ట్‌మెంట్‌లోనూ నిర్వహించేలా ఏర్పాట్లుచేశాం.
>
> – డాక్టర్ రామచంద్ర ఆర్‌కే, ప్రిన్సిపాల్, ఆర్ట్స్ కళాశాల

అవకతవకలపై ఉన్నతస్థాయి దర్యాప్తు చేపట్టాలి

కడియం: మండలంలోని కడియపులంక పరిధిలో డ్వాక్రా గ్రూపు రుణాల చెల్లింపుల్లో జరిగిన అవకతవకలపై ఉన్నత స్థాయి దర్యాప్తు చేపట్టాలని ఇన్‌చార్జి సర్పంచ్ పాటంశెట్టి రాంజీ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. మూడు గ్రూపులకు సంబంధించిన దాదాపు రూ.20 లక్షలకు పైగా గోల్‌మాల్ చేసినట్లుగా ఆయా సంఘాల సభ్యులు ఆరోపిస్తున్నారన్నారు. గ్రామంలో అన్ని గ్రూపులకు సంబంధించిన చెల్లింపులపై విచారణ చేపడితే ఈ మొత్తం ఇంకా పెరిగే అవకాశం ఉందన్నారు. సభ్యుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని ఈ గోల్‌మాల్ వ్యవహారం జరుగుతున్నట్లుగా తెలుస్తోందని రాంజీ అన్నారు. అవకతవకలకు పాల్పడుతున్న వారికి సంబంధిత ఉన్నతాధికారుల తోడ్పాటు కూడా ఉందన్న అనుమానం కలుగుతోందన్నారు. ఇరవై నెలలుగా సభ్యులు మొత్తుకుంటున్నా వెలుగు ఉన్నతాధికారులు, బ్యాంకు అధికారులు పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. తక్షణం విచారణ జరిపించి సభ్యులకు ఆర్థిక నష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి సర్పంచ్ రాంజీ

హెచ్‌ఐవీ నియంత్రణపై అవగాహన కలిగి ఉండాలి

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై నియంత్రణపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు పేర్కొన్నారు. గురువారం జిల్లా వైద్యారోగ్యశాఖ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో యూత్ ఫెస్ట్ 2024–25లో భాగంగా 5కే రెడ్ రన్ మారథాన్‌ను ఆయన పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఆర్ట్స్ కళాశాల నుంచి ప్రారంభమైన 5కే రన్ ఇస్కాన్ టెంపుల్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ హెచ్‌ఐవీ ఉన్న వ్యక్తులపై వివక్ష చూపకూడదని, వారి పట్ల ప్రేమాభిమానాలు కలిగి ఉండాలని చెప్పారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా హెచ్‌ఐవీ ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్.వసుంధర, డాక్టర్ సత్యనారాయణ, డి.సునీత, రాణి, జీజీహెచ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



5కే రెడ్ రన్‌ను ప్రారంభించిన జేసీ చిన్నరాముడు

సింగిల్ విండో విధానం ద్వారా అనుమతి

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): వినాయక చవితి మండపాల్లో గణేష్ విగ్రహాల ఏర్పాటు చేసే వారు సింగిల్ విండో విధానం ద్వారా అనుమతులు పొందాలని రాజమహేంద్రవరం రెవెన్యూ డివిజనల్ అధికారి కె.లక్ష్మీ శివజ్యోతి అన్నారు. గురువారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో గణేష్ ఉత్సవాల అనుమతులకు విధివిధానాలు అమలుపై సంబంధిత అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో లక్ష్మీశివజ్యోతి మాట్లాడుతూ రాజమహేంద్రవరం అర్బన్ పరిధికి మున్సిపల్ కమిషనర్, రూరల్‌కు రెవెన్యూ డివిజన్ అధికారి గణేష్ విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేస్తారన్నారు. మట్టితో తయారుచేసే విగ్రహాలకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ఉండే విగ్రహాలకే అనుమతులు మంజూరు చేయాలన్నారు. సమావేశంలో పోలీస్, ఆర్అండ్‌బీ, ఇరిగేషన్, దేవాదాయ, డీఎంఅండ్‌హెచ్ఓ, పంచాయతీరాజ్, ఎక్సైజ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో లక్ష్మీశివజ్యోతి

మార్గదర్శకాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

రాజమహేంద్రవరం రూరల్: ఎన్టీఆర్ ఆరోగ్య వైద్య సేవల విషయంలో ప్రభుత్వ ప్రైవేటు ఆసుపత్రుల్లో ఎవరైనా మార్గదర్శకాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి స్పష్టం చేశారు. గురువారం స్థానిక కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల ప్రతినిధులతో, అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ అర్హత కలిగిన హెల్త్ కార్డు కలిగిన లబ్ధిదారులకు వైద్య సేవలు అందించడంలో జాబుదారీతనంతో వ్యవహరించాలన్నారు. వైద్య సేవలందించే క్రమంలో లబ్ధిదారుల నుంచి నగదు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. రోగిని డిశ్చార్జి చేసే సమయంలో 10 రోజులకు సరిపడే మందులు, రవాణా చార్జీలు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. నగదు వసూలు, మౌలిక వసతులు కల్పించడం తదితర వాటిపై 11 ఫిర్యాదులు అందాయని పేర్కొన్నారు. వాటికీ సంబంధించి రెక్టిఫికేషన్ చర్యలు తీసుకోవడం జరిగిందని సంబంధిత వైద్యాధికారి వివరించారు. సమావేశంలో జిల్లా ఎన్టీఆర్ వైద్యసేవ కోఆర్డినేటర్ డాక్టర్ ప్రియాంక, జిల్లా ఆరోగ్య అధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, డీసీహెచ్ఎస్ డాక్టర్ ఎస్పీ పద్మశ్రీ, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

గిడుగు రామ్మూర్తి పంతులు చిరస్మరణీయులు



కలెక్టర్ ప్రశాంతి చేతుల మీదుగా సత్కారం అందుకుంటున్న ఉపాధ్యాయుడు గొల్లపల్లి సత్యనారాయణ



జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో మాట్లాడుతున్న వక్తలు



ఓక్ వుడ్ స్కూల్‌లో తెలుగు భాష అక్షరాకృతిలో ఆశీనులైన విద్యార్థులు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): తెలుగు భాషకు వెలుగులద్దిన గిడుగు రామ్మూర్తి పంతులు చిరస్మరణీయులని జిల్లా విద్యాశాఖ కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ వి.వెంకట్రాజు అన్నారు. స్థానిక కోటగుమ్మం వద్ద ఉన్న జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో తెలుగు భాషా దినోత్సవాన్ని అధికారిక కార్యక్రమంగా నిర్వహించారు. వ్యవహారిక తెలుగు భాషోద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి జిల్లా విద్యాశాఖ కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ వి.వెంకట్రాజు పుష్పాంజలి ఘటించారు. అర్బన్ రేంజ్ డీఐబీ దిలీప్‌కుమార్ మాట్లాడుతూ తెలుగులో సృజనాత్మక వ్యక్తీకరణను ప్రోత్సహించేలా వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ కార్యాలయ ఏడీ ఛాయాదేవి, సీఎంవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక మున్సిపల్ కాలనీలోని బీఈఎం ప్రభుత్వ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయిని బి.శారద ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు.

ప్రకాశం నగర్: గిడుగు రామమూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని స్థానిక విజయ శంకర ప్రభుత్వ సంగీత నృత్య పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఓక్ వుడ్‌లో తెలుగు భాషాదినోత్సవం

రాజానగరం: మండలంలోని దివాన్‌చెరువులో ఉన్న ఓక్ వుడ్ స్కూల్‌లో తెలుగు భాషాదినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. స్కూల్ చైర్మన్ డాక్టర్ కె. రాంబాబు మాట్లాడుతూ అమ్మ భాష కమ్మ దనం, తెలుగు భాష గొప్పదనాలను కొనియాడారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, పద్య పఠన పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎ.రాజేంద్రనాథ్, పాఠశాల కార్యనిర్వహణాధికారి పి.నగేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మరో ఉద్యమం చేపట్టాలి

కడియం: పరభాషా సంక్రమణతో ఉనికిని కోల్పోతున్న తెలుగు భాష పరిరక్షణకు గిడుగు స్ఫూర్తితో మరో ఉద్యమానికి సన్నద్ధం కావాలని చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి కళాసేవా సమితి అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అడపా సుబ్రహ్మణ్యం, చిలుకూరి శ్రీనివాసరావు పేర్కొన్నారు. తెలుగు భాషా దినోత్సవ వేడుకల్లో భాగంగా గిడుగు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో చిక్కాల ఈశ్వరరావు, తమ్మిశెట్టి ప్రసాద్, పున్నమిరాజు వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సత్కారం

కడియం: రాజమహేంద్రవరం కలెక్టరేట్‌లో గురువారం జరిగిన తెలుగు భాషా దినోత్సవంలో కడియం హైస్కూలు తెలుగు ఉపాధ్యాయుడు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గొల్లపల్లి సత్యనారాయణను కలెక్టర్ పి.ప్రశాంతి, జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు ఘనంగా సత్కరించారు. గిడుగు రామ్మూర్తి పంతులుపై సత్యనారాయణ రచించిన కవిత, తెలుగు కవులకు సంబంధించిన గేయం అందరినీ ఆకట్టుకుంది.

యువ క్రీడాకారుల ప్రతిభ అభినందనీయం

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం రూరల్: క్రీడల్లో ప్రతిభ చూపి జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిన యువ క్రీడాకారులు అభినందనీయులని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఆమె జాతీయ అంతర్జాతీయ స్థాయిలో పాల్గొన్న క్రీడాకారులను సన్మానించారు. జాతీయస్థాయిలో తైక్వాండో, టేబుల్ టెన్నిస్, బాల్‌బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో ప్రతిభ చాటిన గుబ్బల మేరీ, నల్ల ప్రజ్ఞ, గౌతమ్, వెంకట చైతన్య, రుద్రకుమార్, కె.దివ్యశ్రీ, ఎం.ప్రవీణ్‌కుమార్, వీవీ కిరణ్మయి, జి.అక్షిత, వి.సాత్వికలను కలెక్టర్ సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు, కేఆర్ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆర్.కృష్ణ నాయక్, జిల్లా క్రీడాధికారి డీవీవీ శేషగిరి, కోచ్‌లు ఎస్ఎం దాస్, బీవీ జి.నాగేంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

గిడుగు, ధ్యాన్‌చంద్‌లకు ఘన నివాళి

కడియం: స్థానిక ఏవీఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాలను పురస్కరించుకుని గిడుగు రామ్మూర్తి పంతులు, ధ్యాన్‌చంద్‌లకు ఘన నివాళులర్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులకు టి.సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ఎంఈఓ మణికుమార్ మాట్లాడుతూ భారతదేశానికి మూడు పర్యాయాలు ఒలింపిక్స్‌లో బంగారు పతకాలు సాధించిన ఘనుడు ధ్యాన్‌చంద్ అని కొనియాడారు. ప్రముఖ కవి డాక్టర్ నీలకంఠరావు, ఎంఈఓ నాగేశ్వరరావు, పుష్పలత, శరత్ బాబు, గిరిజ, డేవిడ్, వీరబాబులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరంలో వుమెన్ క్రికెట్ అకాడమీ

ప్రకాశం నగర్: రాజమహేంద్రవరంలో వుమెన్ క్రికెట్ అకాడమీ ఏర్పాటు కానుందని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక ఎస్‌కేవీటీ కళాశాల ఆవరణలో జరిగిన జాతీయ స్పోర్ట్స్ డే వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి తమ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రాజమండ్రిని స్పోర్ట్స్ హబ్‌గా మారుస్తాన్నారు.

జాబ్‌మేళాలో 50 మంది ఎంపిక

ధవళేశ్వరం: ధవళేశ్వరం వివేకానంద ఐటీఐలో గురువారం నిర్వహించిన అప్రెంటిస్ జాబ్ మేళాలో 50 మంది విద్యార్థులు ఎంపికయ్యారని ఐటీఐ ప్రిన్సిపాల్ సుబ్బరాజు తెలిపారు. జాన్సన్ లిఫ్ట్స్, ఎస్కలేటర్స్ సంస్థ విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి 50 మందిని ఎంపిక చేసిందన్నారు. కార్యక్రమంలో క్యాంపెస్ హెచ్ఆర్ రాజబాబు, టెక్నికల్ ఇంజినీర్ చిట్టిబాబు, ట్రెనింగ్ ఆఫీసర్లు గుణశేఖర్, వెంకటేశ్వరరావు, పార్వతీశం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వేమగిరిలో ప్రత్యేక వైద్య శిబిరం

కడియం: సీజనల్ జ్వరాలు పెరుగుతున్న నేపథ్యంలో జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి ఆదేశాల మేరకు రోజుకొక గ్రామంలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నారు. దీంట్లో భాగంగా గురువారం మండలంలోని వేమగిరి పంచాయతీ కార్యాలయం వద్ద వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. జ్వర బాధితులకు వైద్య సేవలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. రోగులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యులు అవగాహన కల్పించారు. శిబిరంలో డాక్టర్ ఎస్.నాగసాయి మౌర్య, వైద్య సిబ్బంది మురళీకృష్ణ, సుజాత, ఉమ, పి.షారోన్‌రోజీ, ఆశా సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కాతేరులో ఉచిత వైద్య శిబిరం

రాజమహేంద్రవరం రూరల్: కాతేరు సంజీవయ్యనగర్‌లో విషజ్వరాల నేపథ్యంలో కాతేరు పీహెచ్‌సీ వైద్యురాలు ఈ.నాగదేవి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం గురువారం నిర్వహించారు. ముందుగా గ్రామంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలతో జ్వరాలపై సర్వే నిర్వహించారు. శిబిరంలో మలేరియా, డెంగ్యూ రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ప్రస్తుతం జ్వరాలు ఎక్కువగా ఉండడంతో జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి ఆదేశాల మేరకు ఉచిత వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు.

ప్రత్యేక వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

రాజమహేంద్రవరం రూరల్: సీజనల్ వ్యాధుల నేపథ్యంలో శుక్ర, శనివారాల్లో నిర్వహించనున్న ప్రత్యేక వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని సంబంధిత పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీల వైద్యాధికారుల ఆధ్వర్యంలో నిర్వహించిన 57 వైద్య శిబిరాల్లో 2456 మంది అవుట్ పేషెంట్‌లను పరీక్షించగా 246 మందికి జ్వరాలు ఉన్నట్లు తేలిందన్నారు.

సంప్రదాయాలను మరువరాదు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): మన ఆట, మన పాట, మన భాష, మన యాస, మన గోస, మన కట్టు, మన బొట్టు, చివరకు మన తిట్టు సహా సంప్రదాయాలను ఎవరూ మరువరాదని తమిళనాడులోని తెలుగుభాషా ఉద్యమ నేత సంవే రమేష్ అన్నారు. కళా గౌతమి 33 వసంతాల వేడుకలోని మూడో రోజు గురువారం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ ఎవరైనా ఎన్ని భాషలైనా నేర్చుకోవచ్చని, తమ మాతృభాష ప్రాముఖ్యతను మాత్రం విస్మరించరాదన్నారు. 20 కోట్ల మంది తెలుగువారి గుండె చప్పుడు వినిపించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ బీవీఎస్ మూర్తి, నన్నయ విశ్వవిద్యాలయ ఆచార్యులు తరపట్ల సత్యనారాయణ, రాజమండ్రి డీఎఫ్ఓ ఎ.శ్రీనివాస్, జక్కంపూడి విజయలక్ష్మి, ప్రసిద్ధ నాట్యాచార్యులు డాక్టర్ సప్తా దుర్గాప్రసాద్, శ్రీహరి జగన్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన అడిషనల్ ఎస్పీ బాధ్యతల స్వీకరణ

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): జిల్లా అడిషనల్ ఎస్పీగా ఎస్.రాజశేఖరరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన జిల్లా ఎస్పీ డి.నరసింహకిశోర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. 1989 బ్యాచ్‌కు చెందిన రాజశేఖరరావు ఇప్పటివరకూ విజయవాడ సీఐడీ రీజినల్ ఆఫీస్‌లో విధులు నిర్వహించారు. సాధారణ బదిలీల్లో భాగంగా జిల్లా అడిషనల్ ఎస్పీగా వచ్చారు.



అడిషనల్ ఎస్పీగా బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్.రాజశేఖరరావు

బూరాడ భవానీశంకర్ జయంతి

రాజమహేంద్రవరం సిటీ: వైఎస్సార్ సీపీ నాయకుడు బూరాడ భవానీశంకర్ 57వ జయంతి సందర్భంగా మాజీ కార్పొరేటర్ బూరాడ కృష్ణ మాధురి, కుమారుడు స్వామి అర్చన్, గంగాధర్ చేతుల మీదుగా స్థానిక 48వ డివిజన్ సంజీవ నగర్ నగరపాలక సంస్థ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మ్యాజిక్ ట్యాబ్‌లు పంచిపెట్టారు. ప్రభుత్వ ఆసుపత్రి వద్ద పేదలకు అన్నదానం నిర్వహించారు. అనంతరం ఆర్ట్స్ కాలేజీ వద్ద ఉన్న ప్రభుత్వ ప్రాథమిక సంక్షేమ కళాశాల బాలికల వసతి గృహంలో నాలుగు ఫ్యాన్లు, నాలుగు లైట్లు భవానీశంకర్ పేరు మీద బహూకరించారు. అనంతరం సంజీవయ్య నగర్ పనసచెట్టు సెంటర్ వద్ద భవాని శంకర్ మిత్రమండలి ఆధ్వర్యంలో మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు జి.ఝాన్సీ లక్ష్మి, సతీష్‌బాబు, సీతారామయ్య, స్వర్ణలత, శారదా దేవి తదితరులు పాల్గొన్నారు.

వీరేశలింగం పంతులు ఆశయాలు నెరవేరుద్దాం

రాజమహేంద్రవరం సిటీ: కందుకూరి వీరేశలింగం పంతులు ఆశయాలకు అనుగుణంగా నగరంలోని టౌన్ హాల్‌ను అభివృద్ధి పరిచి పూర్వ వైభవాన్ని తీసుకొస్తామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం నగరంలోని టౌన్ హాల్‌ను అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో ప్రాచుర్యం పొందిన టౌన్ హాల్ నేడు దయనీస్థితిలో ఉందని, దానిని పునరుద్ధరిస్తామన్నారు. రాబోయే పుష్కరాల నాటికి వీరేశలింగం పంతులు ఇల్లు, టౌన్ హాల్‌ను అభివృద్ధి చేసి ప్రముఖుల ఫోటోలను ఇక్కడ ప్రదర్శిస్తే భవిష్యత్ తరాలకు ఉపయుక్తంగా ఉంటుందన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక సబ్‌స్టేషన్లలో మరమ్మతుల నిమిత్తం రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నక్కపల్లి శామ్యూల్ గురువారం తెలిపారు. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకూ రూపానగర్, తారకరామ నగర్, పోలీస్ క్వార్టర్స్ బ్యాక్ సైడ్, శ్రీరాంపురం రోడ్డు, పిడింగొయ్య, కవలగొయ్య విలేజ్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు. అలాగే ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ నేతాజీ నగర్, జేఎల్‌బీ నగర్, ఏసీబీ కాలనీ, రాఘవేంద్రనగర్ కాలనీ, బొమ్మూరు చెరువు, బాలాజీపేట సెంటర్, నవభారత్ నగర్, గురుకులం, వెంకటేశ్వర కాలనీ, మురళీ కొండ, వెంకటగిరి కొండ, కొత్తపేట, కొంతమూరు ప్రాంతాల్లో విద్యుత్ నిలిచిపోతుందన్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ అన్నపూర్ణమ్మపేట, మదన్‌సింగ్ పేట, జాంపేట, లక్ష్మీవారపుపేట, అల్లూరి సీతారామరాజు జంక్షన్, గణేష్ చౌక్, రామచంద్రరావుపేట, సాంబశివరావుపేట, కోర్లంపేట ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని ఎన్టీఆర్ నైపుణ్యాభివృద్ధి మరియు మహిళాసాధికార సంస్థ(మహిళాప్రాంగణం)లో ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సు, స్వీట్స్ అండ్ స్నాక్స్ తయారీ, బ్యూటీ కల్చర్ కోర్సుల్లో శిక్షణలు ప్రారంభించనున్నట్లు సంస్థ జిల్లా మేనేజర్ సీహెచ్‌వీ నరసమ్మ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 18 ఏళ్ల నుంచి 45 ఏళ్ల లోపు వయసున్న మహిళలు శిక్షణకు అర్హులన్నారు. ఆసక్తి గలవారు తమ బయోడేటాను తమ కార్యాలయాలనికి అందజేయాలన్నారు. శిక్షణ పూర్తయిన అనంతరం పరీక్ష నిర్వహించి సర్టిఫికెట్లు జారీ చేస్తామన్నారు. మరిన్ని వివరాలకు 83339 21340 ఫోన్ నంబరులో సంప్రదించాలన్నారు.

దివ్యాంగుల సమగ్రాభివృద్ధికి కృషి

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): దివ్యాంగుల అభివృద్ధికి ఏపీ సమగ్ర శిక్ష అన్ని రకాల సహాయ సహకారాలను అందిస్తుందని, వీటిని ప్రత్యేక అవసరాలు గల పిల్లలందరూ సద్వినియోగం చేసుకోవాలని సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి, అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎస్.సుభాషిణి చెప్పారు. దివ్యాంగ విద్యార్థులకు డిజిటల్ విద్యను అందించి వారిలో అభ్యసనా నైపుణ్యాలు ఏ విధంగా పెంపొందించాలనే అంశంపై గురువారం లాలాచెరువు మున్సిపల్ హైస్కూల్‌లో సహిత విద్య రిసోర్స్ పర్సన్లు, ఐఈఆర్‌పీలకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర సమగ్ర శిక్ష ఐఈ కన్సల్టెంట్ డాక్టర్ వై నరసింహం, రాష్ట్ర సహిత విద్య సహాయ సమన్వయకర్త డాక్టర్ ఎన్.అమ్మినాయుడు, డాక్టర్ నరసింహం తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ ఉద్యోగులకు బహుమతులు

రాజమహేంద్రవరం సిటీ: ప్రతి నెలా విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించిన ఉద్యోగులను ఎంపిక చేసి ప్రోత్సాహక నగదు బహుమతులను అందించే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రాజమహేంద్రవరం డిపో మేనేజర్ షేక్ సబ్నం పేర్కొన్నారు. గురువారం డిపోలో 2024 జులై నెలలో అత్యధిక ఆదాయం, అత్యధిక డీజిల్ సేవింగ్స్ చేసిన సిబ్బందికి నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశామన్నారు. ఇదే స్ఫూర్తిని కొనసాగించి, డిపో అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు.

మేం గేట్లు తీస్తే వరదలా వచ్చేస్తారు

రాజమహేంద్రవరం రూరల్: తమ పార్టీ గేట్లు తీస్తే వైఎస్సార్ సీపీ నుంచి వరదలా వచ్చేందుకు ఆ పార్టీ నాయకులంతా సిద్ధంగా ఉన్నారని రాజమహేంద్రవరం రూరల్ టీడీపీ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. గురువారం ఆయన తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన తప్పుడు విధానాల వల్ల రాష్ట్రం ఛిన్నాభిన్నం అయ్యిందన్నారు. ఇప్పుడు ఆ పార్టీ నేతలు తలోదారి వెతుక్కుంటున్నారని చెప్పారు. బోట్స్‌మెన్ సొసైటీలకు ఇసుక తవ్వకాలకు అనుమతులు ఇవ్వాలన్నారు. లంక భూముల్లో ఇసుక తవ్వకాలకు అవసరమైతే డ్రెడ్జింగ్‌కు కూడా అనుమతివ్వాలని ప్రభుత్వాన్ని కోరానన్నారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ వాసిరెడ్డి రాంబాబు, మత్సేటి ప్రసాద్, గంగిన హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.